కథానిక :

'సమన్వయం'

శ్రీ బలివాడ కాంతారావు

ఒంటి కొబ్బరిచెట్టు......

దాన్ని ఒకే గుత్తికి రెండే కాయలు ఒకదాని నొకటి కౌగలించుకుంటూ...చెట్టుకానుకొని విశాలాంబుధి వేపు తదేకదీక్షతో చూస్తున్న నవయౌవనశోభతో తొణికిసలాడే ఓ జంట...

భల్లూకం కడుపులో క్రుంగే భానుని అలసట చెందిన చిరునగవులో నాట్యమాడుతున్న తరంగాల సమూహం......

చిన్న గోచీపాతలతో, వస్తున్న చేపలపడవ కోసం ఒడ్డున నిలబడి చూస్తున్న జాలరిపిల్లలు.

నిశ్శబ్దంగా కూర్చున్నయ్ యిసుకరేణువులు...

ఓ తెల్లని పక్షి నీలాకాశంలో అలా మందగమనంతో......

కంటికి శోభతో కనిపించేదే స్వర్గం !!

* * *

గౌరీపౌర్ణమినాటి పండు వెన్నెల......

ఆ పర్వతంపై ఒక చివర మసీదు...రెండో చివర చర్చి......రెండిటికీ మధ్యను హిందూ దేవాలయం.. ...

ఆ మూడు పవిత్ర చిహ్నాలూ ఆ పాలవెన్నెల్లో ఐరావతం కన్నా తేటగా కనిపిస్తున్నయ్...

ఒక మూల నిలబడి చూస్తే కనిపిస్తుం దొక నాట్యభంగిమ...

రెండవమూలనుంచి వీక్షిస్తే దివాన్ ఇఖాస్ ప్రాంగణంలో ఓ మొగలాయీకాలపు నాట్యరీతి గోచరిస్తుంది...

యెదురుగా నిలబడి దృష్టి నిలిపితే మణిపురీ నాట్యకళ కళ్ళయెదుట తాండవిస్తుంది.

నాట్యంచేసేది ఒకే ఒకజంట...!

మతాలు వేరైనా మనసు లొక్కటే...!!

చెవి అప్పగిస్తే......గుడిగంటల మ్రోత, చర్చిగంటలు వినిపిస్తాయ్...మసీదులో ప్రశాంతత భగ్నం కాదు.

దీక్షగా చూస్తే...ఆ మూడు చిహ్నాలలో దీపాలు వెలిగిన ట్లుంటయ్...స్త్రీ, పురుషుడు కళోపాసకులైనపుడు కళామయమైన సుందర సృష్టిలో యెక్కడైనా యే సమయమందైనా తన్మయులై పోతారు !

సులోచనాలు భక్తితో కొలుస్తున్నాయ్ ఆ ప్రేమమయుని దృష్టిని...ముడతలు బడ్డ శరీరం...విశాలవక్షం.. బోసినోరు...ఆ నాలికపై భగవద్గీత, ఖురాను, బైబిలు అన్ని పవిత్ర గ్రంథాలు స్థావరం యేర్పరచుకున్నాయట !

చేతులెత్తి నమస్కరిస్తుంటే...నిన్ను ఆక్షణం మానవుని చేస్తుంది ! నీ వీ జన్మయెత్తి చేయవలసిన విధులను జ్ఞప్తికి తెస్తుంది !!

ఆ బోసినోటినుంచి రాలిన రత్నాలు నీపై వర్షిస్తాయి !!!

* * *

సుప్రసిద్ధ తైలచిత్రకారుడు గోపాలరావు తన కళాకౌశల్యంతో యెన్నో యిలాంటి వుత్తమ తైలచిత్రాలను సృష్టించాడు.

* * * *

ఆర్థికంగా ఒకడు పేద అని మానసికంగా వాడిని పేదచేయటం పొరపాటు. పల్లెలో వున్న పేద రైతు పట్నంలో వున్న శ్రీమంతునికన్నా వుదారహృదయుడు. తను త్రాగే గంజిలో సగం కడుపు మాడ్చుకొనే తోడివానికి పోస్తాడు. పట్నవాసుల్లో అది అరుదు. ఆ పట్నవాసులే అలా సంచరించి అతిథిసత్కారాల మూలమైన మన నాగరికతకు కళంకం తెచ్చారు. లోకం దృష్టిలో మనదేశాన్ని చులకన చేసింది వారి చేష్టలే! గ్రామసీమల సంపద పాడుచేసింది వారే. ధనిప్రభుకు స్వర్గం అనుకొని కామాను తన జీవితానికే ఆధారమైన పల్లెవానిని చూసి హేళన ..పల్లెటూరి పశువు !!!

పారతంత్ర్యం పాతుకపోయిన ఆ దినాలలో మాతృవియోగం వలన యేకాకియై గోపయ్య ఒక గోచిపాతతో పట్నంమీద వ్యామోహంతో పరుగెత్తివస్తే ఆదరించేవా రెవరు ! పల్లెలో గొర్రెలమందల వెంట పడినా కాస్త గంజి పోస్తురు...పాలెకాపుగా వున్నా నలుగురూ ఒక కంటికో చూద్దురు.

పదేండ్లు నిండని పాపడు బజారునుంచి నెత్తిన కూరగాయలబుట్టతో రామారావుగారి వెంట నడిచాడు ఆ వుదారవుత్తమకళావేత్త గృహంలో నోరు తెరచి వింతగా ఆ మహానుభావుడు సృష్టించిన చిత్రాలవేపు రెప్ప వేయకుండా చూస్తున్నాడు అందిస్తున్న అణా ఆయనకళ్ళకు కనపడదు.

'బాబుగోరూ! యివన్నీ యెవరు రాసినర్రు?'

'నేను'

అరచేతిని చూసుకుంటూ 'ఊహుం. నాసేత కాదు.'

నిట్టూర్పుతో క్రుంగిన నిరాడంబరజీవిలోని పిపాసను కనిపెట్టిన ఆ కళానిధి వానిలో వున్నత భావిని చూశాడు.

'నేర్చుకుంటావా ?'

'నా కెవరు నేరపతారు బాబూ ?'

'నేనే...నా యింట్లో వుండు.'

'కూలిసేసి ఆ డబ్బు మారాజుసేతకే పెడతాను'

'కూలి యిక చెయ్యొద్దు. నే చెప్పినట్లు విను.'

అప్పట్లో అలా గోపయ్యను తలమీదబుట్టతో నిలబెట్టి వ్రాసిన చిత్రానికి యెందరో యెన్నో వందలిస్తామన్నారు. కానీ గోపయ్యను గోపాలరావుచేసి, చదువుకూడ చెప్పించి ఆ చిత్రాన్ని శిష్యునకు గురువే కానుకగా యిచ్చి యీ విశాల ప్రపంచంలో వుత్తమకళావేత్త కమ్మని విడిచిపెట్టాడు. ఇలాంటి సంఘటనలు లోకంలో జరగటం చాలా అరుదు !

* * *

కళాజీవికి కడుపుకు కఱవంటారు. లక్ష్మీ సరస్వతులకు బద్ధవైర మట ! ఆయన నిర్విరామ కృషి ఆయనకు లక్ష్మీ సరస్వతుల కటాక్షాన్ని కలిగించింది. అవును-'కృషితో నాస్తిదుర్భిక్షమ్!'

చేతిలో కళ వుండగా వినియోగించక, అనుకూల వాతావరణం లేదని, ఆర్థికంగా లాభం లేదని యేవో సాకులు చెప్పేవాడు ఆ కళకే కాదు, మానవసంఘానికే ద్రోహాన్ని తలపెట్టుతున్నా డన్నమాట !

ఆ జనసమ్మర్దంగల ప్రదేశంలో ఆ యింటిలో అలాంటి వుత్తమ చిత్రాలను సృష్టించాడంటే ...గురువు తరచితరచి చెప్పిన పై మాటలు గోపాలరావు తలలో యెప్పుడూ తిరుగుతూనే వుంటయ్......

* * *

కొందరిని, అధికారం గ్రుడ్డి, చెవిటివాళ్లను యెలా చేస్తుందో అలా యౌవనంకూడ కొందరిమీద తన ప్రాభవాన్ని చూపిస్తుంది !

తన కళాపటిమతో ఒక సుందరిని సృష్టించాడు. తన యౌవ్వనత్వాన్ని మరచిపోయి, తన విధులను మరచిపోయి యెల్లప్పుడూ ఆ చిత్రాన్ని చూస్తూ కూర్చొనేవాడు. అందాన్ని సృష్టించినవాడు అందానికే దాసోహం అన్నాడు! సృష్టికర్త తను సృష్టించిన సరస్వతినే ఆశించాడు కదా !!

అందమైన దేదైనా చూస్తుంటే ఆరాటం హెచ్చవుతుంది. ఏంటో అల్లుకుంటారు మనోవీధిలో.. అది సామాన్య మానవునికి సహజం.

'ఇదిగో ఫోటో. నీ ఫోటో చూసి, నీ యౌవ్వనత్వాన్ని విని నీ అర్ధాంగిగా వుండటానికి ఒప్పుకుంది.' అని ఒక ఫోటోను అందిచ్చాడు, తనను కొడుకులా చూసుకుంటున్న సంసారి, వయోజ్ఞానవృద్ధుడు సుందరరామయ్య.

గోపాలరావు ఫోటోను చూడలేక కండ్లు మూసాడు. తన చిత్రానికి, ఈ ఫోటోకి స్వర్గ, నరకాలకి మధ్య నున్నంత దూరం !

'సంగీతనిధి. వీణ వాయిస్తుంటే స్వర్గలోకంలో విహరిస్తాం' అన్న రామయ్యమాటలు వినిపించుకోలేదు. నలిపి పారవేశాడా ఫోటోను టేబిలుక్రింద చెత్తకాగితాలబుట్టలో...

కళ్లుమూసి టేబిలుమీద తల వాల్చి 'బాబాయ్! వుద్యానవనంలోనికి...యేంటి యిలాంటి...' అంతకుమించి పెదిమలు కదలలేదు.

'నాయనా గోపాలం! కోయిల లేకపోతే ఆవుద్యానవనానికి శోభ లేదోయ్.'

గోపాలం కళ్లంట నీరు తిరిగింది.

'నీకష్టం నాకు తెలుసు నాయనా. తప్పుత్రోవలో నడుస్తున్నావని తప్ప యింకేం అన దలచుకోలేదు.'

* * * *

'నాయనా ! నువ్విలా యీ పిచ్చిలో పడి నీ గురూపదేశాన్ని మరచిపోతున్నావ్. ఇది నీకు తగని పని అశాశ్వతమైన ఒకస్త్రీ అందాన్ని ఆశించి శాశ్వతమైన కీర్తికి దూర మౌతున్నావ్. సృష్టించి, నీ సేవకురాలి పాదాలపై నీవే పడటం...'

'కాదు బాబాయ్. అందం కళకంటే గొప్పది. అందం వుంటేనే కళమనుగడ. నే తప్పుదారిని పోలేదు.'

'తర్కంలోనికి దిగి కాదు అన్నది, అవునని నిరూపించటానికి నీ కింకా అనుభవం చాలదు నాయనా. ఇంతకే నీ వుద్దేశంలో అందం యీ కళలన్నిటికీ మూలం అని కదూ. అయితే నివ్వు నీ తల్లి నీ కాముకవాంఛతో ప్రేమిస్తున్నావన్న మాట !'

'బాబాయ్...ఇలా అనటం న్యాయంగా వుందా ?'

'న్యాయాన్యాయాలు యీ పరిస్థితిలో నీ తలలోనికి రావు బాబూ. నా బాగోగులతో నాకు సంబంధం వుంది కాబట్టి నే క్షేమన్నా వేరుగా తలంచను. యిలాంటి స్త్రీ యీ ప్రపంచంలో నీకు దొరకదు.'

'దొరకదూ ? ఆమెను చూస్తూ నా కుంచెను వెయ్యివిధాల త్రిప్పడా మనుకున్నా. బాబాయ్! ఇంత అందమైన స్త్రీలు యీ ప్రపంచంలో లేరా ?'

'పిచ్చినాయనా ! లేరని కాదు. ఉంటారు. కానీ,నివ్వు స్త్రీలలో యెంతకాలమూ అందాన్ని చూస్తావ్ ? నీ భార్యగా చేసుకోవాలనుకుంటున్నావ్ ? అంత అందమైన స్త్రీ నిన్ను పెండ్లాడదు. ముమ్మాటికీ చెప్తున్నా. ఒకప్పుడు పెండ్లాడునంటావ్. ఆమె నీ కుంచెను నడపటానికి అవకాశం యీయదు. కళాజీవిపిపాసను యింకొక కళాజీవే అర్థంచేసుకుంటుంది. నీ భార్య కళాజీవియైతేనే నివ్వు కళారాధకుడ వనే నామాన్ని సార్థకంచేసుకుంటావ్. నీవు పెండ్లి చేసుకోవటకు నా కిష్టం లేదు మొదట. కానీ గృహజీవనంలో మానవజన్మ యెత్తి నీవు సాధించవలసిన మంచికూడ వుంది. అంతే కాకుండా, నీలాంటి పేటిచిత్రకారుడు నిన్ను నాన్నా అని పిలవాలి.'

'బాబాయ్ ! నాలో వున్న లోటేంటి ? అందమైన స్త్రీ నన్ను పెండ్లాడదా ?'

'నాయనా ! యెందుకు పెళ్లాడదో తరవాత చెప్తాను. ఒక మురళీ కృష్ణుని నీవు నా కివ్వాలి. యీ రోజే మొదలు పెట్టు. కులంచే నేను పరాయివాడినైనా అభిమానంచే నేను నీ బాబాయిని. నా కోరిక తీర్చు, బాబూ.'

* * *

విధిలేక కుంచె నడచింది. వారంరోజులు గడచిపోయాయ్. బాబాయ్ ఒక్కసారీ కన్పించలేదు.

పదిరోజులు దాటింది. చిత్రం పూర్తయింది. బాబాయ్ కనిపించలేదు.

పదిహేనోరోజు బాబాయ్ వచ్చాడు. దీనంగా చూస్తున్నా డా సుందరిపటంవేపు.ఆమె చిరునగవు వెలబోస్తోంది ఆ మేలిముసుగు చాటునుండి.

'ఇదా ప్రపంచం ?' అనే ప్రశ్న ఆమె మోములో తాండవిస్తున్నా భ్రాంతితో వివేకాన్ని దాచిపెట్టిన గోపాలం ఆ భావాన్ని అర్థంచేసుకోలేకపోయాడు.

బాబాయ్ గంభీరంగా అన్నాడు 'ఇదేనా, నీ చిత్రకళాకౌశల్యం ? పిచ్చివాడవురా నాయనా. మురళీకృష్ణునివేపు దృష్టి సారించు.'

గోపాలరావు అర్థనిమీలితనేత్రాలతో చూశాడు.

'నీవు వ్రాసింది మురళీకృష్ణుడినా, లేక మట్టిబొమ్మనా ?'

'..................'

'మాట్లాడవేం ? నీకు మురళీనాదం వినిపిస్తోందా ?'

'లేదు '

'కారణ మేమంటావ్ ?'

'ఏమో ?'

నిట్టూర్పు విడుస్తూ కుర్చీమీద కూర్చున్న గోపాలరావుదగ్గరకు వచ్చి వీపుమీద అభిమానంగా ఒకసారి చెయ్యివేసి యెదురుగా ఆ టేబిలుమీద నున్న సుందరిపటమును మురళీకృష్ణుని చిత్రం ప్రక్కను పెట్టి...

'యిప్పుడైనా వినిపిస్తోందా ?'

'లేదు.'

'ఎంచేత ? అశాశ్వతమైన ఆడదాని కండలపొందికతో కళను ఆరాధిస్తానంటే యేమౌతుంది? యీ బొమ్మను పట్టుకొని వ్రేలాడితేనే నీ కళకు కళంకం వచ్చిందే...అందమైన స్త్రీని చేపట్టితే నీ విధిని మరచి నీవు అధముడివై పోతావ్'

'బాబాయ్!'

'లేదు లేదు. యీ స్త్రీ యీ యింట్లో వుండటానికి తగదు.'

పెరట మండుతున్న మంటలో ఆ సుందరిపటం రూపులేకుండా పోయింది. 'ఆడదాని అందంకూడా యిలాగే అవుతుంది తెలుసా ?' అని అరిచాడు సుందరరామయ్య !

ఫట్ !!!

చిరునగవుతో కుడిచేతితో చెంప తడుముకుంటూ 'నాయనా గోపాలం ! ఇంతేనోయ్. ఒక్క చెంప పెట్టుతో చాలించావ్...బోసినోటివాడిని రాలటానికి పళ్లు లేవులే. యికనైనా నా మురళీకృష్ణునికి ప్రాణం పోయవా ?'

"...... ."

'తల దించావ్—మాట్లాడ వేం నాయనా !'

(18 వ పేజీ చూడుడు)

భవిష్యద్వాణి

నీ విషయమై 1948 సం॥లో ఏమి జరుగబోవును?

నీ భవిష్యత్తులో ఏమి జరుగబోవునదిన్నీ నీ సరియైన చర్య గురించిన్నీ నీవు తెలుసుకొన గోరినట్లయితే, ఒక పోస్టుకార్డుపైని నీ కిష్టమగు ఒక పుష్పము పేరున్నూ నీవు వ్రాయు తేదీ వేళ వివరమున్నూ నీ సరియైన చిరునామాయున్నూ వెంటనే వ్రాసిపంపుము.

జ్యోతిష శాస్త్రములోని రహస్యగణితీ మూలముగా మేము గుణించి, నీవు కార్డు వ్రాసిన తేదిలగాయతు 12 మాసములలోను నీయొక్క అదృష్టము, లాభనష్టములు, జీవిత మార్గము, ఏ వ్యవహారములో నీకు జయము కలుగును, నీ ఉద్యోగము విషయములో మంచి చెడ్డలు మార్పులు, ఆరోగ్య విషయము, పరదేశ గమనము, తీర్థయాత్రలు, వివాహము, స్త్రీ సుఖము, సంతానము, నిధినిక్షేపములు, లాటరీ, అకస్మాద్ద్రవ్యలాభము, మొదలగువానిని గురించి స్పష్టముగా మాసవారీగా వ్రాసి రు. 1-4-0 లకు మాత్రము వి.పి.గా పంపగలము. (వి. పి. ఛార్జీలు ప్రత్యేకము). దుష్టగ్రహము లేవైన ఉన్నయెడల శాంతిచేయు విధానము కూడా తెలుపుడుచేయడమగును. వివరములు మా పూచీపైని పంపబడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగానుండని యెడల, పైకము వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించి చూడుడు.

పండిట్ దేవదత్ శాస్త్రి, రాజజ్యోతిషి,
(ఎ. పి. ఎం.) కర్తర్‌పూర్ (ఇ. పి.)

Pt. DEV DUTT SHASHTRI, RAJ JYOTISHI,
(A. B. M.) KARTARPUR (E. P.)

'సమన్వయం'

(11-వ పేజీ తరువాయి)

నీచేష్టకు సిగ్గుపడుతున్నావా? అబ్బే వద్దు నాయనా వద్దు. నేను బాధపడలేదు—ఆ యీ సంఘటన నీకు జ్ఞానోదయం కలిగిస్తుందని.'

'నాజన్మలో అలా మళ్లీ వ్రాయగలనా...?' గొణుక్కొని కళ్లంట నీరు కార్చివేస్తున్నాడు గోపాలం.

'వద్దు నాయనా, వద్దు. మళ్లీ అలాంటి చిత్రాన్ని వ్రాసి అందమైన పెళ్లాంకోసం ఆశలు పెట్టుకోవద్దు.. ఏవు కురూపివి.'

'హాఁ...'

'అవును. అందమైన స్త్రీ కంటికి కురూపివి. నాకంటికి కాదు!'

'కురూపిని. నాకు అందమైన స్త్రీని పెండ్లాడే అర్హత లేదా? హాఁ...లేదా?'

'ఆలోచించు నీవే. ఆ మెఫాటో నివ్వాళించి వంత అందంగా లేదని నలిపి చెత్తకాగితాలలో పారవేశావే...ఆమె వుదారహృదయంతో నీలాంటి కురూపిని ప్రేమిస్తానంటే ఆలోచించకుండా, బుద్ధిలేకుండా సంచరించావే.. నీ ఫోటో ఒక అందమైన స్త్రీ చేతికి యిస్తే యేం చేస్తుంది?'

'బాబాయ్! యీ కురూపికి యీ కళ యెందుకు? యెవరిని వుద్ధరించడానికి?....

క్షమించు. అపరాధం చేసాను. యీ వ్రేళ్లను నరకాలి. అప్పుడుగాని పాప విమోచనం లేదు!

'అంత పని చేయకు నాయనా! నే కష్టపడి లేగా నీకు పాపం సోకడానికి? ఆ వ్రేళ్లతోనే అందాన్ని సృష్టిస్తావ్. నీ ముఖంలో అందం లేకపోయినా నీ చేతిలో 'అందం' వుంది. నా మురళీ శ్రీకృష్ణునికి యికనైనా జీవం పోయవూ?'

'యీ సంక్షోభమైన మనసుతో యెలా జీవం పోయమంటావ్ బాబాయ్?'

'నీ గురూపదేశాన్ని యీ మాటలతో విస్మరిస్తున్నావ్. పట్టుదలవుంటే అననుకూలపరిస్థితులు అడ్డు రావు. యీ కండలపొందికను తలచుకొని జీవితాన్ని నాశనం చేసుకోకు. కొందరి కళ్ళకు బాహ్యఅందం లోటుగా కనిపిస్తే వాళ్ళ హృదయాలను నీలో అంతర్గతమైన అందంతో ఆకర్షిస్తున్నావ్. ఆ అందాన్ని చూసే నేను నిన్ను ప్రేమిస్తున్నా. నాబిడ్డకంటే హెచ్చుగా చూసుకుంటున్నా. పల్లెలోని నా బంగళాలోనికి పో...ఒంటరి బ్రతుకు, ప్రకృతిలో కొన్నాళ్లు లీనమయ్యావంటే శాంతిస్తావ్. యీ యిల్లు మార్చి వేయాలని వుంది. ఆపని నే నిర్వహిస్తాను.

* * *

సెలవాటింది......

రెండు నెలలు......

సుందరరామయ్య ఆ పల్లెవేపు తొంగిచూడలేదు. ఆవేళే యిల్లు మార్చి పల్లెకు బయలుదేరాడు...

'నాయనా గోపాలం! యౌవనంలో అందంతోనే ప్రపంచం వుందని గెంతులేయటం, అందం పోషణకు యావచ్ఛక్తినీ వినియోగించటం, తను అందంగా వున్నాననే తృప్తితో మానవుడు మెలగటం సహజం! నోటినిండుగా నే నంటేగాని నీవు నీ నమ్మకాన్ని విడిచిపెట్టలేక పోయావు. అయినా, యిప్పటికీ యే కోశంలోనైనా నేను అందగాడిననే భ్రాంతి వుంటుంది! ఒక స్త్రీ ప్రేమకోసమే కదూ అందంగా వుండాలనుకుంటున్నావ్—నిన్ను ప్రేమిస్తా నన్న స్త్రీ నీ కళను గౌరవించి నిన్ను ప్రేమించింది. అదే కళాజీవి బాధ్యత. మాయమర్మము లేని బ్రతుకు మానవ జీవితానికి రాచమార్గం రా గోపాలం! యీ చిత్రంలో యిప్పుడు జీవకళ వుట్టిపడుతోంది కదూ?'

'లేదు బాబాయ్ లేదు. ఇంకా జీవకళ వుట్టిపడలేదు. నే బ్రతికినన్నాళ్లూ దీనికి జీవం వచ్చేవరకు విడిచిపెట్టను.'

'నీకే సంతృప్తి లేనప్పుడు నేను సంతృప్తిపడినా లాభం లేదు. నిన్న నే యిల్లు మార్చాను. అక్కడే జీవం పోద్దువుగాని.'

'యిక్కడ చాలా ప్రశాంతంగా వుంది బాబాయ్. యిక్కడే కొన్నాళ్లుండనీయ్.'

సుందరరామయ్య చిరునగువుతో వెళిపోయాడు.

* * * *

రెండు నెలలు దొర్లిపోయాయ్..

'నీవు వ్రాసిన చిత్రాలు ఆ క్రొత్త యింటిని యింద్ర భవనాన్ని చేశాయి. ఇంద్రుడు లేని యింద్రభవనానికి ఎందరో వచ్చి దర్శనం దొరకక నిస్పృహతో వెళ్ళిపోతున్నారు. యికనైనా రా నాయనా!'

'బాబాయ్. యీ చిత్రం పూర్తి కానిది రాలేను.'

'నీ వొక్కడవూ యెన్ని సంవత్సరాలకైనా ఆ చిత్రానికి జీవం పోయలేవోయ్. ఇంకొక కళాజీవి నీకు కళాభిక్ష పెట్టాలి....యీ మాసిన గడ్డంతో వైరాగ్యంలో కాలుపెట్టకు...నడు'

బలవంతాన బాబాయ్ మాటలు త్రోసిపుచ్చలేక బయలుదేరాడు.

* * * *

వాన వెలిసింది. యెగిరే ధూళి పొగరు అణగిపోయింది. మబ్బుల్లోని చందమామ మెల్లగా త్రోవచేసుకొని దరహాసచంద్రికలను వెదజల్లుతున్నాడు

ప్రకృతిలో పుట్టారు. ప్రకృతిని ఆధారం చేసుకొనే బ్రతుకుతారు. దానిని చూసే ఆనందిస్తారు—చివరకు దానిని జయించా మనటానికి కూడ వెనుదీయరు—మానవులు!!

'నాయనా గోపాలం! నీవు కాదు, మానవ మాత్రు డెవడూ ప్రకృతిని జయించలేడోయ్. ప్రకృతిని అర్థం చేసుకున్నకొలదీ మానవుడు తను సుఖంగా బ్రతకడానికి కావలసింది సంపాదించుకుంటాడు.'

వేణుగోపాలునివేపు గోపాలరావు ఏకదీక్ష దృష్టితో చూస్తున్నాడు. యీ మాటలు వినిపించలేదేమో..

'బాబాయ్! బాబాయ్! దీనిని తీసుకపో...వింటున్నా మురళీస్వరాన్ని......జీవం పోశాను'

'భ్రమపడుతున్నావు నాయనా!'

'కాదు, బాబాయ్ కాదు'

'నీవు వింటున్నది వేణునాదం కాదోయ్, వీణా నాదం'

'కాదు బాబాయ్, కాదు. వేణువాదం మధుర స్థాయిలో వినిపిస్తోంది'

'యెప్పుడు చూసినా అలా వినిపిస్తుందా?'

'దీనికి జీవం వుంది. వినిపిస్తుంది!'

'ఇంకా విను...తన్మయుడ వైపో'

గోడగడియారంలో పెద్ద ముల్లు నాలుగంకెలను దాటింది. 'టంగ్'మని ఒకగంట కొట్టింది.

'ఇప్పుడు వినిపిస్తోందా నాయనా?'

'...............'

'మాట్లాడవేం?'

'లేదు...బాబాయ్, లేదు'

'అలా కంగారుపడకు. లే, నాయనా లే. చేతితో పట్టుకో ఆ చిత్రాన్ని. వ్రాసిందినీవు... జీవం పోసేది ఇంకొక రయ్యారు...కళకు శోభనిచ్చేది కళే!

ప్రక్కయింటి సుమ్మం యెదురుగా ఆ వాలిపోయిన వెన్నెల్లో ఆ చిత్రాన్ని పట్టుకొని నిలబడ్డారు...

'యిప్పుడు వినిపిస్తుందా నాయనా, వేణువాదం......'

'హాఁ. వింటున్నా...'

'అయితే, దీనిని పట్టుకొని ఆ గదిలోనికి పో. నీకు కళాభిక్ష పెట్టే ప్రకృతి అందులోనే వుంది. ఆమెను అర్థంచేసికొని సుఖంగా కాలం గడుపు'

* * *

ఆయన లోన కాలుపెట్టాడు...

'ఆహాఁ! దయచేసి వీణ మీటించండి...'

కళారాధకు లనిపించుకొనేవారు కళను గౌరవిస్తారా యీ రోజుల్లో?'

'బుద్ధివాడు గౌరవించడు. మా బాబాయ్ నేత్రదానం చేశారు.'

లోటుపాట్లను తెలుసు కొన్నాక సవరించుకోడానికి మంచివా డెంతగా వుబలాటపడతాడో ఆమెకు తెలుసు!

అలా తల దించే చేతివ్రేళ్లను నడిపించింది...

ఆయన చూస్తున్నా డా చిత్రంవేపు. ఆమె చూస్తోంది ఆవీణమీద ఆమెవ్రేళ్ల కదలికను...

ఆయన వింటున్నాడు మురళీనాదాన్ని తన్మయుడై...

స్థాయి హెచ్చింది. ఆమెగొంతుక విప్పింది ...మురళీనాదమే కాదు...కృష్ణుని చుటూ గోపికలు నాట్యం చేస్తున్నారు బృందావనంలో...!! తను బృందావనంలో ఒక చెట్టు చాటున దాగొని కళ్లారా చూస్తున్నాడు!!

పాట పూర్తయింది...

రెప్పలు గబగబ కదిపాడు. అంతా మాయమయ్యారే! తన యెదురుగా వున్నది తనచేతితో వ్రాసిన తైలచిత్రమా? కృష్ణుడు, గోపికలు, బృందావనం యెక్కడ??

బాబాయ్ గదిలో కాలుపెట్టాడు.

'నాయనా, యిప్పుడైనా కళ యొక్క ఔన్నత్యాన్ని తెలుసుకున్నావా? కళారాధకుడు చెడుప్రకృతులకు దూరంగా వుంటేనే రాణిస్తాడు. కళకు కళే జీవం పోసుకుంటుంది. లే...నా చిత్రాన్నినాకిచ్చివెయ్... నీ బాబాయ్ దానికి ప్రతిఫలంగా ఇచ్చేది ఆ కళాజీవిని నీ అర్థాంగిని—స్వీకరించు!

నాయనా.

అమ్మా..

బాబాయ్ యిద్దరిని పిలిచాడు దగ్గరగా...

మధ్యనుండి రెండు చేతులు కలిపి 'మీ రిరువురూ కలసి మీ కళాకౌశల్యంతో మానవ సంఘానికి మీ సర్వశక్తినీ వుపయోగించి సేవ చెయ్యాలి.'

అక్కడే వున్న మురళీకృష్ణుని ముందు ముగ్గురూ చేతులు జోడించారు.

— —

'తిట్టుకవిత'

(16-వ పేజీ తరువాయి)

వరుస జూ 'పన్నాల వంశవైఖరి' యన
వరత సమృద్ధి వైభవము నొందె"

గత సంవత్సరం ఈ వార పత్రికలో నే బ్రహ్మశ్రీ చెళ్ళపిళ్ల వేంకట శాస్త్రిగారు ఏదో సందర్భంలో ఏతత్కావ్యప్రశంస తెస్తూ కవి పన్నాల బ్రహ్మన్నను గురించి కొన్ని విషయాలు తెలిపారు. ఈ కవి శివమహిమ స్తవమును తెలుగు జేసెనట! ఈ పద్యం చూడండి:

నా మహిమ స్తవమును విబు
ధామోదము గాగ గూర్చి తాంధ్రోక్తిని నీ
కీమెయిని జేయవలసిన
కామితమెయ్యది వచింపు కడక నొసగెదన్,

ఇందు రావణుడుగా పేర్కొనబడిన యితని ప్రతిస్పర్థి యితని మాన్యము నపహరించినాడట. అందుకు కుపితుడై కవి యీ కావ్యం రచించినాడు. రావణుని మాట లివి:

అతని మాన్యక్షేత్రహరణంబు సేయ బ్ర
త్యక్షంబుగా బోదు నాకడంక
....
సామమున గొందునా, భూమి జాత రుచిని
ధనము నర్పించికొందునా, తవిలియంత
భేదమున గయికొందునా, పెలుచ గినిసి
దండమున స్వీకరింతునా చండగతుల?

(భూమిజాత + రుచిని)

రావణునికి అతని క్షేమాకాంక్షి యొకడు హిత ముపదేశిస్తున్నాడు. ఇది చూడండి:

ఈదబోయిన ద్రాగుటకించుకైన
నీరు లే దను సామెత నిక్కమయ్యె;
మనకు నంకురమే లేక వనరునప్పు
డీ వరక్షేత్రహరణాదు లెందు కధిప!

ఇందు గోదావరీ మండలమందలి పలివెల గ్రామము అయోధ్యగా వర్ణింపబడింది. ఇదియే కవి జన్మస్థానమయి యుండవచ్చును. రావణుడుగా పేర్కొనబడిన యితని ప్రతిస్పర్థి కవి మాన్యమును హరించుట మాత్రమేగాక రాజేశ్వర శాస్త్రిని, కనకదండివారు, దర్భా సుబ్రహ్మణ్యము, బొమ్మకంటి సుబ్రహ్మణ్యము మొదలైన వారి వృత్తులకు కూడ హానితెచ్చి వారిని గాసిల్ల జేసినట్టుకూడా యిందు వర్ణింపబడింది.

ద్వ్యర్థిపద్యరచనలో ఈ కవి కలమునకు ఎట్టి వైపు వాటములు గలవో చూడండి:

నినునాపలేక విశ్రుతి
గనెగడి యుండగను వాంఛ గలిగె న్నా కీ
వు నటుల నడువుమనుచు నా
చెనటిని దానన్న పల్కు చెల్లింబనిచెన్,
తనువాళ జెతిచి వనిచిన
తని ఖరహృదయమునం గృశానుస్థితి జెం
పెనయం జేయుచు బ్రేరే
చిన 'రత్నము' పేరెద గలిసి చలనమొందన్.

* * *

స్వామి, యిడియేమి రామ
స్వామి నితరుగాగ జూడజనునా మన కా
రామబ్రహ్మము కినిసిన
చో మఱుపగలడె యెరుడు సుకరప్రౌఢిన్.
రామనయమార్గ మెనయన్
రామస్వామికి మనోహరశ్రీమెనయం
గా మాధుర్యము జూపుచు
నామృగతృష్ణ యెదవంగ నసెనొక్క తమిన్.
మన భూమిజ నానందిత
జెనటుల హరియింతు రనుచు జెందిన వగతో
వనరుచు జింతల బాయుట
కనువుపడక స్వాశ్రయమున కరుగ దలంపన్.
రామ యహితోక్తి చెవిసోక బ్రహ్మమను హి
తుండు లక్ష్మణమూర్తి సంతోషమెడలి
వచ్చి తన గురుమార్గంబె పట్టి నడచె
మాలవిధి చెయ్వ లేరికి మలపవచ్చు.

ఇతని కవితాకన్యకు శయ్యాసౌభాగ్యము పెట్టిన తొడవు; పద్యము లితనివి కవితారచనలో నితడు బాగుగా చేయితిరిగిన వాడు సుమా అనిపిస్తవి. ఈ పద్యాలు చూడండి:

అని మది నెంచి యెంచి యని
యంపు దలంపుల మించిమించి యా
త్మనిహిత దృష్టకాముకృత
తాపము దండడిగ గండికంది యొ
య్యన దిగలొందియుంట దన
యాంగబలంబున గుండికుంది యొ
వ్వని పని బట్టి యా విబుధ
వైరి ధరింపుచు జంద్రహాసముల్.

* * *

మాయను జేసితే ప్రియ త
మాయను మాయనుకూల భాగ్యధా
మాయను మాయనంటి విను
మా యను దార సీతయే
మా యను మాయను ఝంతరమా
యను ని న్నెడబాయజాలర
మ్మాయను మాయను త్తమత
మాయను మాయను పోకు మాయనున్.
హా యను నే ననాథ నహా
హాయను యానము లేకు భూరి బా
హా యను మాన మేల నస
హాయను జేయకుమా చిరాత్తమా
హాయను నీ యనుగ్రహ స
హాయను విశ్వసుభైకచారుదే
హాయను భిన్న శత్రుని వ
హా యను శౌర్యసుమస్వహా యనున్.

ఆశ్వాసాంతపద్యము లివి చూడండి:

బ్రహ్మద్వేషి మనఃకనత్కఠినతా
భాస్వచ్ఛిలావిస్ఫుర
ద్బ్రహ్మక్షేత్ర హరాపకీర్తి సముకుం
భన్నీలిమప్రస్ఫుర
ద్బ్రహ్మస్వాపహృదాత్మ కామవిపులా
రంభోన్నతి ప్రోల్లస
ద్బ్రహ్మర్తి ప్రదశీల దుస్సహ ఘన
ప్రాకార మధ్యాలయా!
విద్వత్కవితా వల్లభ
మృద్వీకఘు బ్రహ్మవాక్సమీడితపద్య
స్వాద్వనుభవ నిర్మితత
ద్విద్వయ పురుషార్థ సారథి విహతపార్థా!
శిష్టమాన్యస్ఫురత్ క్షేత్రహృన్మారణా
కష్టకూలాయుధాభీష్ట సంపూరణా
దుష్టదైత్యావళీ దుఃఖదాకారణా
స్పష్టసంసార మజ్జజ్జనోత్తారణా.

[సశేషం]

నెరసిన వెంట్రుకల ఔషధము

రంగు పూయనక్కరలేదు. ఆయుర్వేదచికిత్స. తెల్లని, తంగును మార్చి శాశ్వతముగా వెంట్రుకలకు నలుపు నిచ్చును. గుణం కానిచో, డబ్బు వాపసు చేయబడును. తెలుపు కొంచెమైయుండిన రూ2-8-0; మధ్యరకమైయుండిన రూ 3-8-0; పూర్తిగాయుండిన 5-0-0.

గమనింపు:— ఇది మెదడుకు కంటికి మంచి పోషణ విచ్చు ఔషధము.

Bharat Kalyan Aushadhalaya
P. O. Raniganj (Burdwan)

గనోక్యూర్
అన్నిసెగలకు గంటలలోగుణము
ఈశ్వర ఫార్మసీ, రాజమండ్రి